


ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే..

నియోజక వర్గం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
వరంగల్	కడియం కావ్య	సుధీర్‌కుమార్	అరూరి రమేష్
మహబూబాబాద్	బలరాం నాయక్	మాలోతు కవిత	సీతారాంనాయక్



ఇక సమరమే!

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటం.. అటు వరంగల్.. ఇటు మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలకు ప్రధాన పార్టీలన్నీ అభ్యర్థులను ప్రకటించడంతో ఓరుగల్లు రాజకీయాలు హీటెక్కుతున్నాయి. కడియం షాక్ నుంచి తేరుకున్న బీఆర్ఎస్.. ఉత్కంఠకు తెర దించుతూ వరంగల్ అభ్యర్థిని ఖరారు చేసింది. దీంతో అభ్యర్థులంతా ప్రజాక్షేత్రంలో 'ఇక సమరమే' అంటూ తాడోపేడో తేల్చుకునేందుకు రెడీ అవుతున్నారు. కుల సమీకరణలతో పాటు గత ఎన్నికల్లో వచ్చిన ఓట్లను లెక్కలు వేస్తు నేతలు వ్యూహాలకు పదను పెడుతున్నారు. గులాబీ పార్టీకి కంచుకోటలుగా ఉన్న వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాల్లో పాగా వేసేందుకు కాంగ్రెస్, బీజేపీలు బలమైన అభ్యర్థులను బరిలో దించగా, తమ స్థానాలను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నాలు చేస్తుంది. దీంతో ఒక్కసారిగా ఓరుగల్లు రాజకీయాలు హీటెక్కుతున్నాయి.

అభ్యర్థులు ఫైనల్....

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం వరంగల్, ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం మహబూబాబాద్ లోక్‌సభ సీట్లకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారయ్యారు. బీఆర్ఎస్ తొలుత మార్చి 13న వరంగల్ అభ్యర్థిగా స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తెను ప్రకటించింది. కానీ తాను ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేయలేనంటూ మార్చి 27న బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన కావ్య 30వ తేదీన తన తండ్రి కడియం శ్రీహరితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ ఆమెను వరంగల్ అభ్యర్థిగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి ఎవరు అనే ఉత్కంఠ నెలకొంది. తెరపైకి పలువురి పేర్లు రావడం, అనేక నాటకీయ పరిణామాల మధ్య శుక్రవారం బీఆర్ఎస్ అధినేత హనుమకొండ జడ్పీ చైర్మన్‌గా ఉన్న సుధీర్‌కుమార్‌ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో రెండు వారాలుగా నెలకొన్న ఉత్కంఠకు తెర పడింది. ఇక బీజేపీ నుంచి వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. మహబూబాబాద్ కాంగ్రెస్ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితలను ఖరారు చేశారు. ఇక బీజేపీ నుంచి మాజీ ఎంపీ సీతారాంనాయక్‌ను బరిలో ఉన్నారు. మాజీ ఎంపీలు బరిలో ఉండటంతో మానుకోట రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. కాగా, బీజేపీ నుంచి బరిలో దిగుతున్న ఇద్దరు అభ్యర్థులు అరూరి రమేష్, సీతారాంనాయక్ బీఆర్ఎస్ నుంచి వలస వచ్చిన నేతలే. వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య కూడా బీఆర్ఎస్ నుంచి వలస వచ్చిన వారే. వరంగల్ బరిలో ఉన్న ముగ్గురు కూడా బీఆర్ఎస్ నేపథ్యం ఉన్న వారే కావటం చర్చనీయాంశంగా మారింది. దీంతో ఎవరు ఓట్లకు ఎవరు ఎసరు పెడుతారో అనే ఉత్కంఠ కూడా అభ్యర్థుల్లో నెలకొంది. ఇక ప్రధాన పార్టీల అభ్యర్థుల ఎంపికలో అధిష్ఠానవర్గం కుల సమీకరణలకు పెద్దపీటలు వేశాయి. వరంగల్ పార్లమెంట్ పరిధిలో మాదిగ సామాజిక వర్గం ఓట్లు అధికంగా ఉండటంతో బీజేపీ, బీఆర్ఎస్‌లు ఆ సామాజిక వర్గం నేతలకే టికెట్లు కేటాయించాయి. మాదిగ ఉపకులం అభ్యర్థిని కాంగ్రెస్ బరిలో దించింది. మూడు పార్టీలు కూడా మాదిగ సామాజిక వర్గం నుంచే అభ్యర్థులను బరిలో దించటంతో మాల సామాజిక వర్గం ఓట్లు ఎటువైపు మొగ్గు చూపుతాయే అనేది చర్చనీయాంశంగా మారింది.

- 'ఓరుగల్లు' ఉత్కంఠకు తెర దించిన బీఆర్ఎస్
- అభ్యర్థిగా సుధీర్‌కుమార్‌ను ప్రకటించిన అధినేత
- ఇప్పటికే ప్రజల్లోకి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు
- గత అసెంబ్లీ ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేసిన హస్తం పార్టీ
- వరంగల్, మహబూబాబాద్ ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు
- గులాబీ కంచుకోటల్లో పాగాకు కాంగ్రెస్, బీజేపీ ఎత్తులు

ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖరారుతో వేడెక్కిన ఉమ్మడి జిల్లా రాజకీయం


ప్రజాక్షేత్రంలోకి అభ్యర్థులు...

వరంగల్‌లో బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు, మహబూబాబాద్‌లో మూడు పార్టీలు అభ్యర్థులు ఇప్పటికే ఖరారు కావటంతో ప్రజాక్షేత్రంలోకి దిగారు. వరంగల్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను కలిసి తనకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరుతున్నారు. పరకాల, భూపాలపల్లి, స్టేషన్‌ఘనపూర్ తదితర నియోజక వర్గాల్లో నిర్వహించిన బూత్ కమిటీల సమావేశాల్లో పాల్గొంటున్నారు. కాంగ్రెస్ పార్టీలో తన చేరిక, తన కులం, మతంపై వస్తున్న ఆరోపణలు, విమర్శలను తిప్పికొడుతూ ప్రసంగాలు సాగిస్తున్నారు. ఇక ఊరూరా తిరిగి ఇంటింటి ప్రచారానికి

మిగతా 7వ పేజీలో..

బీఆర్ఎస్ అభ్యర్థిగా మారపెల్లి

- జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్‌కు వరంగల్ లోక్‌సభ టికెట్
- అధికారికంగా ప్రకటించిన అధినేత కేసీఆర్



రాంనగర్, ఏప్రిల్ 12: వరంగల్ బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థిగా డాక్టర్ మారపెల్లి సుధీర్‌కుమార్‌ను ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ అధినేత కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌లో వరంగల్ లోక్‌సభ పరిధిలోని బీఆర్ఎస్ నేతలతో భేటీ అయ్యారు. నేతల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత సుధీర్‌కుమార్ పేరును అధికారికంగా ప్రకటించారు.

కాగా, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యను తొలుత బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించినప్పటికీ ఆమె అనూహ్యంగా పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఆపై కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ నుంచి బరిలో నిలిచారు. ఈ క్రమంలో పార్టీని వీడిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్యను తిరిగి తీసుకువచ్చి బరిలో నిలపాలని మంతనాలు జరిపారు. బీఆర్ఎస్ నేతల సూచన మేరకు ఫామ్‌హౌస్ సమీపంలోని ఒక హోటల్‌లో రాజయ్య బస చేశారు. కేసీఆర్ పిలుపు కోసం వేచి ఉన్నాడు. కేసీఆర్ భేటీలో జిల్లా నేతలు సైతం రాజయ్య వైపే మొగ్గు చూపినప్పటికీ

మిగతా 7వ పేజీలో..

బయోడేటా

పేరు	: మారపెల్లి సుధీర్ కుమార్
కులం	: మాదిగ (ఎస్సీ)
పుట్టిన తేదీ	: 30-8-1962
విద్యార్హతలు	: ఎం.డి. (యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్)
తండ్రి పేరు	: మారపెల్లి జాన్
తల్లి పేరు	: కిరీటమ్మ
భార్య	: శోభారాణి(మెడికల్‌ఆఫీసర్)
కుమారుడు	: సుజన్‌కుమార్ (బీటెక్)
కూతురు	: సుకీర్తి (అసిస్టెంట్ సివిల్ సర్జన్)
నివాసం	: ముల్కనూర్, భీమదేవరపల్లి మండలం, హనుమకొండ

అరూరి రమేశ్‌వి చిల్లర రాజకీయాలు

- నా బిడ్డగా కావ్యకు నా కులమే వర్తిస్తుంది
- నా వల్లే రమేశ్ కాంట్రాక్టర్‌గా, ఎమ్మెల్యేగా ఎదిగాడు
- బీఆర్ఎస్ నుంచి డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే తప్పుకుంటాం
- మాదిగ జాతి ద్రోహి మందకృష్ణ : కడియం శ్రీహరి



7

కడియం ఎమ్మెల్యే కాకముందే నేను కాంట్రాక్టర్‌ను..

- ఆయన ఆస్తులను ప్రజలు గమనిస్తున్నారు
- ఇన్నాళ్లు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఎందుకు గుర్తుకు రాలేదు?
- ఏ లబ్ధి కోసం పార్టీ మారారో ప్రజలకు చెప్పాలి
- వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్



7

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలి
- జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్



పెద్దవంగరలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డేవిడ్

పెద్దవంగర, ఏప్రిల్ 12 : ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్దవంగర మండల కేంద్రంలోని ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేసేందుకు ప్రణాళికలను రూపొందించామని, క్రయవిక్రయాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. 17 శాతం కంటే తక్కువ తేమ ఉండాలి.. ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలన్నారు. రైతులు పండించిన ధ్యానానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దళారులు ధాన్యం విక్రయించిన వెంటనే డబ్బులు ఇస్తామని చెప్పే మాయమాటలకు రైతులు మోసపోవద్దని సూచించారు. ప్రతీ తూకము ఖచ్చితంగా ఎలక్ట్రానిక్ మిషన్ల ద్వారానే కొనుగోలు చేయాలని, అందుకుగాను ప్రతీ సెంటర్ వద్ద ఎలక్ట్రానిక్ మిషన్లు ఏర్పాటు చేశామన్నారు.

దళారులు కొనుగోలు చేసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తే కేసులు నమోదు చేయడంతోపాటు సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని డేవిడ్ హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాల నుంచి గన్నీ సంచులను పొలాలకు వద్దకు ఇస్తే ఆయాకేంద్రాన్ని రద్దు చేస్తామని అన్నారు. ప్రతీ సెంటర్‌కు టార్పాలిన్లను, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు అవసరయ్యే గన్నీ సంచుల వివరాలను ముందస్తుగానే జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీరగంటి మహేందర్, డీపీఎం నళినినారాయణ, ఇన్‌చార్జ్ ఏవో కుమార్‌యాదవ్, పీఏసీఎస్ సీఈవో మురళి, ఏఈవోలు పాల్గొన్నారు.

ఆర్టీసీ పరిరక్షణ ఉద్యమ కేసులను ఎత్తివేయాలి



మాట్లాడుతున్న సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 12 : ఆర్టీసీ కార్మికుల కోసం ఉద్యమంలో పాల్గొన్న సీపీఐ నేతలపై అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. మహబూబాబాద్ అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని పరిరక్షించాలని, కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ సమ్మె చేస్తున్న కార్మికులకు అండగా నిలబడి ఉద్యమంలో పాల్గొన్న సీపీఐ నాయకులపై కేసులు పెట్టారని, ఆ కేసుల్లో ఉన్నవారు కోర్టుల చుట్టు తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా బనాయించిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, నర్ర శ్రావణ్, ఫాతీమా, మంద శంకర్, పద్మ, శంషీర్, కూరాకుల పాల్, మాధవి, స్వరూప, రమ, కవిత, వినోద, లక్ష్మి నర్సు, శారద, సత్యం, నగేష్, బాలాజీ పాల్గొన్నారు.

వ్యాధి మూలాన్ని గుర్తించేది హోమియోపతి వైద్యం

మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 12 : సూక్ష్మమైన హోమియోపతి గుళికలతో అనితర సాధ్యమైన రోగాలను నయం చేయవచ్చని, వ్యాధి మూలాన్ని గుర్తించేది హోమియోపతి వైద్యమేనని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మండలం సోమ్లతండాలో ప్రపంచ హోమియోపతి వారోత్సవాలను పురస్కరించుకుని డాక్టర్ పరికిపండ్ల అశోక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన హోమియో శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి, మాట్లాడారు. ప్రపంచంలో అతి తక్కువ ఖర్చుతో వ్యాధుల నుంచి శాశ్వతమైన పరిష్కారం చూపించేది హోమియోపతి వైద్యమని, దీనిని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా అన్నిజిల్లాలో హోమియోపతి వారోత్సవాలు ఈనెల 10వ తేదీ నుంచి 16 వరకు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇస్లావత్ బాలాజీ, ఎంపీటీసీ రాంచందర్, లకావత్ పద్మ, సూర్యం, వెంకన్న, గుగులోతు వీరమ్మ పాల్గొన్నారు.



మహబూబాబాద్ మండలం సోమ్లతండాలో హోమియోపతి మందులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

బీజేపీతోనే నవసమాజ స్థాపన

- పార్టీ జిల్లా అధ్యక్షుడు యలమంచి వెంకటేశ్వర్‌రావు

గూడూరు, ఏప్రిల్ 12 : భారతీయ జనతా పార్టీతోనే నవసమాజ నిర్మాణం సాధ్యపడుతుందని జిల్లా అధ్యక్షుడు యలమంచి వెంకటేశ్వర్‌రావు అన్నారు. గూడూరు మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ మండల పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. క్రమశిక్షణ కలిగిన పార్టీగా బీజేపీ పేరొందిందని పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు శక్తివంచన లేకుండా పార్టీ అభివృద్ధి కోసం పాటుపడాలన్నారు. బూత్ కమిటీ నుంచి మొదలుకుని జిల్లా కమిటీ వరకు పారదర్శకంగా కమిటీ సమావేశాలు, కార్యక్రమాలు జరిగే విధంగా కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.



గూడూరులో మాట్లాడుతున్న యలమంచి వెంకటేశ్వర్‌రావు

స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక స్థానాలు గెలిచే విధంగా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి అజ్మీరసీతారాంనాయక్‌ను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు లింగాల సుధీర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గుండబోయిన మల్లేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మేరెడ్డి సురేందర్, బత్తుల లక్ష్మణ్, నాగరాజు, కోరె అనిల్, బండి వెంకన్న, గడిలనాగరాజు, బ్రహ్మచారి, ఎం.శ్రీనివాస్, దారం వెంకన్న, పలు గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నేడు పార్లమెంట్ బూత్‌స్థాయి సమ్మేళనం

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని బాలాజీ గార్డెన్‌లో శనివారం ఉదయం 10 గంటలకు పార్లమెంట్ బూత్‌స్థాయి సమ్మేళనంను నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు యలమంచి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. మహబూబాబాద్ పార్లమెంట్‌పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని బూత్‌స్థాయి అధ్యక్షులు, మండల, జిల్లా, రాష్ట్రనాయకులు సుమారు 3500 మంది హాజరవుతారని చెప్పారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా కర్ణాటక ఎమ్మెల్యే అభయ్‌పాటిల్‌తో పాటు బీజేపీ ఎంపీ అభ్యర్థి అజ్మీర సీతారాం నాయక్, జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, క్రమశిక్షణ సంఘం రాష్ట్ర చైర్మన్ మార్తినేని ధర్మారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, వరంగల్ మాజీ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 12 : మానుకోట జిల్లా కేంద్రంలోని పాతబజారులోని పలు కాలనీల్లో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు టౌన్-1 ఏఈ సంగీత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతబజారులోని వ్యవసాయ మార్కెట్, మునిసిపాలిటీ ఏరియా, రైల్వేస్టేషన్, గోపాలపురం కాలనీ, ఆర్టీసీ బస్టాండ్, అంబేద్కర్ కాలనీ, రాంచంద్రాపురం కాలనీ, గాయత్రిగుట్ట ఏరియాల్లో వివిధ పనులు, సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు చెప్పారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

- తొర్రూరు : తొర్రూరు సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్‌లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ వంశీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న ఉదయం 8నుంచి 10 గంటల వరకు తొర్రూరు పట్టణంతో పాటు సోమ్లా తండా, చింతలపల్లి, హచ్చుతండా, కొమ్మనపల్లి తండా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.
- డోర్నకల్ : డోర్నకల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డోర్నకల్, ఉయ్యాలవాడ, అమ్మపాలెం, బంజర, చాంప్లాతండ, సీతారాంపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు డోర్నకల్ డిస్కం ఏఈ శుక్రవారం తెలిపారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.
- మరిపెడ : శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మరిపెడ ఏడీఏ లోక్‌నాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మరిపెడ ట్రాన్స్‌కో సబ్ డివిజన్ పరిధిలోని మరిపెడ, ఉల్లెపల్లి, ఎల్లంపేట, చిన్నగూడూరు, పెద్దనాగారం, కౌంసల్యదేవిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్లలో రిపేరు పనులు జరుగుతున్నాయన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గుర్తించి, సహకరించాలని కోరారు.

శుక్రవారం ఉష్ణోగ్రతలు	గరిష్ఠం : 36.0°C	కనిష్ఠం : 24.5°C

దంపతుల విషాదాంతం!



పెండగట్ల అనిల్, దేవి (ఫైల్)

- అనుమానాస్పద స్థితిలో భార్యాభర్తల మృతి
- నామాలపాడు గుట్టపై అస్థిపంజరాలు లభ్యం
- గతనెల 10న ఇద్దరు కూతుళ్లను హతమార్చి పరారీ
- 32 రోజుల ఉత్కంఠకు తెర

గార్ల, ఏప్రిల్ 12 : ప్రేమ వివాహం చేసుకున్న ఆ దంపతులు వ్యక్తిగత కారణాలతో కన్నప్రేమను మరిచి ఇద్దరు బిడ్డలకు పాలలో విషం కలిపి ఇచ్చి హతమార్చి.. రాత్రిరాత్రికి ఇంటి నుంచి పరారయ్యారు. 32 రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆ దంపతుల కథ కూడా విషాదాంతమైంది. గార్ల మండలంలో జరిగిన ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ..

గార్ల మండలం సీతంపేట గ్రామపంచాయతీ శివారు అంకన్నగూడేనికి చెందిన డ్రైవర్ పెండగట్ల అనిల్(27), బయ్యారం మండలం నామాలపాడు ప్రాంతానికి చెందిన దేవి (24) ఐదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి లాస్య (3), జశ్విత (11 నెలలు) ఇద్దరు కూతుళ్లు జన్మించారు. అయితే తమది పేద కుటుంబం కావడం, ఇద్దరు కూతుళ్ల జన్మించడం, కుమారుడు కావాలన్న కోరిక ఉండటమో లేదంటే ఇంకేమైనా ఇబ్బందులు ఉన్నాయో తెలియదు కానీ గతనెల 9న రాత్రి ఇద్దరు కూతుళ్లకు పురుగులమందును కలిపిన పాలను తాగించి చనిపోయారని నిర్ధారించుకున్న తర్వాత వారిని మంచంపై పడుకోబెట్టి ఇంటి బయట తలుపునకు తాళం వేసి పరారయ్యారు. మరుసటి రోజు ఉదయం ఇంటి పక్కనే ఉంటున్న అనిల్ తండ్రి వెంకన్న.. తన కుమారుడి ఇంటికి తాళం వేసి ఉండటంతో అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా, ఇద్దరు మనవరాళ్లు కదలిక లేకుండా ఉండటంతో పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు తలుపులు తెరిచి చూడగా అప్పటికే చిన్నారులు మృతిచెంది ఉన్నారు. అదేరోజు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

ఇక పిల్లలను హతమార్చి ఇంటి నుంచి అదృశ్యమైన తల్లిదండ్రులిద్దరూ పశ్చాత్తాపంతో ఆత్మహత్య చేసుకున్నారన్న వదంతులు కూడా వచ్చాయి. ఈ క్రమంలోనే పోలీసులు గ్రామసమీప ప్రాంతాల్లో గాలిస్తుండగా.. రెంద్రోజుల కింద నామాలపాడు గుట్ట సమీపంలో అనిల్‌కు సంబంధించిన ద్విచక్రవాహనాన్ని గుర్తించారు. ఆ తర్వాత ముమ్మరంగా గాలించగా.. గుట్టపై చెట్టుకు వేలాడుతూ పురుషుడి, కింద మహిళ అస్థిపంజరం కన్పించాయి. గుట్ట సమీపంలో లభ్యమైన ద్విచక్రవాహనం, గుట్టపైన ఘటనా స్థలంలో దొరికిన ఆనవాళ్ల ప్రకారం ఆ అస్థిపంజరాలు అనిల్, దేవియేనని బయ్యారం, గార్ల సీఐ రవికుమార్, గార్ల ఎస్ఐ జీనత్‌కుమార్ నిర్ధారించారు. అయితే నెలరోజుల క్రితం ఇద్దరు కూతుళ్లకు విషమిచ్చి, చంపి పరారైన అనిల్, దేవి పశ్చాత్తాపంతో ఆత్మహత్య చేసుకుని ఉంటారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మహిళను మోసం చేసిన వ్యక్తి అరెస్టు



హనుమకొండ టౌన్, ఏప్రిల్12: పోలీసునంటూ భర్త లేని ఒంటరి మహిళను మోసం చేసిన ఘటనలో నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఇన్స్‌పెక్టర్ వై.సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన మహిళతో రాజన్న సిరిసిల్ల జిల్లా చీర్లవంచకు చెందిన మామిడి కిరణ్ పోలీసునంటూ పరిచయం పెంచుకున్నాడు. వివాహం చేసుకొని, తన ఇంటిని బాధిత మహిళ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుతానని మాయ మాటలు చెప్పి మహిళ నుంచి బంగారు ఉంగరం, పుస్తెలతాడు, చైన్ తీసుకున్నాడు. వివాహం విషయం ప్రస్తావించగానే ఇంకోసారి వివాహమంటే చంపుతానని బెదిరించి మహిళ నుంచి మరో లక్ష ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. నిందితుడి వేధింపులు భరించలేని బాధిత మహిళ ఈనెల 7న ఫిర్యాదు చేయగా పక్కా సమాచారంతో శుక్రవారం ఉదయం హనుమకొండ బస్టాండ్‌లో నిందితుడి అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామని సీఐ వెల్లడించారు. నిందితుడి నుంచి పుస్తెలతాడు, ఏపీ పోలీసుశాఖతో ఉన్న నకిలీ ఐడీ కార్డును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ధార్మిక భవన్ స్థలంపై

కొత్త వివాదం

- స్థలం తమదంటున్న మేడారం జాతర పూజారులు
- వేదపాఠశాలను ధార్మిక భవన్‌లోకి తరలించకుండా మెలిక
- స్థలం తమదేనని దేవాదాయశాఖ అధికారుల స్పష్టం

హనుమకొండ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ధార్మికభవన్ స్థలంపై కొత్త వివాదం తలెత్తింది. భద్రకాళి దేవాలయం ప్రాంగణంలో ఉన్న వేద పాఠశాలలను ధార్మిక భవన్‌లోకి తరలించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర పూజారులు ఈ కొత్త వివాదానికి తెరతీశారు. ధార్మిక భవన్ నిర్మించిన స్థలం తమదేననే వాదన లేవనెత్తారు. మేడారంలోని సమ్మక్క, సారలమ్మ జాతరకు సంబంధించి గెస్ట్‌హౌస్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేయడానికి ఉద్దేశించి ఈ స్థలం అప్పట్లో ఇచ్చారని మేడారం పూజారులు వాదిస్తున్నారు. ధార్మిక భవన్‌లో వేద పాఠశాల ఏర్పాటు చేయడం ద్వారా రూ.కోట్ల విలువ చేసే ధార్మిక భవన్‌ను భద్రకాళి దేవస్థానానికి స్వాధీనం చేసేందుకు దేవాదాయ శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారన్నది వారి ఆలోచన. ఈ ప్రయత్నాలను ఆపకపోతే మేడారంలో విధులను బహిష్కరిస్తామని కూడా హెచ్చరిక చేశారు. మేడారం పూజారులు పెట్టిన ఈ మెలికతో ధార్మిక భవన్‌లోకి వేద పాఠశాల తరలింపుపై అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది.

రికార్డుల్లో దేవాదాయ శాఖదే..

దేవాదాయ శాఖ వాదన మరో విధంగా ఉంది. ఈ స్థలం దేవాదాయ శాఖదేనని అధికారులు చెబుతున్నారు. స్థలానికి సంబంధించి అందుబాటులో ఉన్న రికార్డులు కూడా ఇదే చెబుతున్నాయి. సర్వే నెంబరు 725లో 1014 గజాల స్థలాన్ని 1993 సెప్టెంబర్ 30వ తేదీన అప్పటి కలెక్టర్ బి7/55/93 ద్వారా దేవాదాయ శాఖకు కేటాయించినట్టు రికార్డులు చెబుతున్నాయి. వరంగల్ పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా వరంగల్-హనుమకొండ ప్రధాన రహదారికి అనుకొని ఉన్న ఈ స్థలాన్ని వాస్తవానికి మొదట ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు జీవితబీమా సంస్థకు అప్పగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి. అయితే అప్పటికే భద్రకాళి దేవస్థానం భక్తుల సౌకర్యార్థం ధర్మసత్రాల నిర్మాణానికి స్థలం కోసం కలెక్టర్‌కు వినతి చేసి ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని జీవిత బీమా సంస్థకు ఈ ఇక్కడ కాకుండా మరోచోట కేటాయించారు. ఆలా ఈస్థలం దేవాదాయ శాఖకు కేటాయించినట్టు సమాచారం.

లోకాయుక్తకు వెళతాం..

ధార్మిక భవన్‌పై మేడారం పూజారుల ఈకొత్త వివాదం వెనుక ఓ అధికారుల తెర వెనుక పాత్ర ఉన్నట్టు అనుమానం కలుగుతోందని కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ కన్వీనర్ చీకటి రాజు అనుమానం వ్యక్తం చేశారు. మొదటి నుంచి వేద పాఠశాలను ధార్మికభవనంలోకి తరలించడం ఇష్టం లేనందువల్ల పరోక్షంగా మేడారం పూజారులను రెచ్చగొట్టడం ద్వారా అడ్డుపుల్ల వేసే ప్రయత్నాలు జరుగుతున్నట్టు కనిపిస్తోందన్నారు. అవసరమైతే దీనిపై లోకాయుక్తకు వెళతామని స్పష్టం చేశారు.

అరూరి రమేశ్‌వి చిల్లర రాజకీయాలు

● కులం, మతాన్ని అడ్డు పెట్టుకొని రాజకీయాలు చేయొద్దు.. ● నా వల్లే రమేశ్ కాంట్రాక్టర్‌గా, ఎమ్మెల్యేగా ఎదిగాడు.. ● మీడియాతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి



డీసీసీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 12: బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మండిపడ్డారు. తన కూతూరు వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టరు కడియం కావ్య కులం, వివాహం వంటి వ్యక్తిగత విషయాలపై రమేశ్ మాట్లాడడం అనైతికమని ధ్వజమెత్తారు. శుక్రవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన అరూరి రమేశ్‌పై విరుచుకుపడ్డారు. కావ్య వరంగల్‌లో జన్మించి ఇక్కడే విద్యాభ్యాసం పూర్తి చేసిందన్నారు. వర్ధన్నపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టరుగా పని చేసిందన్నారు. కావ్య ముస్లింను వివాహం చేసుకున్న విషయాలపై అరూరి రమేశ్ ఇష్టారాజ్యంగా మాట్లాడడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. రాజకీయాల్లో ఆరోపణలు, విమర్శలు ఉంటాయని, కానీ వ్యక్తిగత విషయాలను రాజకీయం చేయడం అనైతికమని పునరుద్ఘాటించారు. కబ్జాల చరిత్ర ఉన్న రమేశ్‌ను ఊళ్లలోకి రానివ్వకుండా ప్రజలు ఎదురు తిరిగారని చెప్పారు. అలాంటి చరిత్ర తమకు లేదన్నారు.

కడియం కావ్య వివాహం స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ మేరకు జరిగిందని శ్రీహరి వివరించారు. ఈ చట్టం ప్రకారం మతాంతర వివాహం జరిగినప్పటికీ భార్యభర్తలు ఎవరికి వారు తమ మతాన్ని ఆరాధించుకోవచ్చని తెలిపారు. భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు మతం మారినా కులం మారదని వివరించారు. పిల్లలకు తండ్రి కులమే వర్తిస్తుందన్నారు. ఈ మేరకు తన బిడ్డగా కడియం కావ్యకు తన కులమే వరిస్తుందని కడియం శ్రీహరి వివరించారు. రాజ్యాంగం, చట్టాలపై అవగాహన లేని అరూరి రమేశ్.. ఇతర బీజేపీ నాయకులతో పాటు బీఆర్ఎస్ నాయకులు కావ్య మతం, కులం, ప్రాంతం విషయంలో చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కడియం కావ్య ఎస్సీ కాదని నిరూపించగలరా? అంటూ శ్రీహరి సవాల్ విసిరారు. ఎవరెన్ని చిల్లర రాజకీయాలు చేసినా కావ్య గెలుపు ఖాయమైందని శ్రీహరి ధీమాగా చెప్పారు.

అరూరి రమేశ్ క్లాస్-1 కాంట్రాక్టర్‌గా, ఆ తరువాత రాజకీయంగా, ఎమ్మెల్యే స్థాయికి ఎదిగింది తన వల్లేనని శ్రీహరి చెప్పుకొచ్చారు. కేసీఆర్‌కు చెప్పి 2014లో ఆయనకు ఎమ్మెల్యే టికెట్ ఇప్పించినట్లు తెలిపారు. తాను ఎవరికీ వెన్నుపోటు పొడవలేదన్నారు. నిజాయితీ, నైతిక విలువలే తనకు రాజకీయ అవకాశాలు తెచ్చిపెట్టాయన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల నుంచి తాను డబ్బులు తీసుకున్నట్లు వస్తున్న ఆరోపణల్లో నిజం లేదని కడియం శ్రీహరి కొట్టి పారేశారు. డబ్బులు తీసుకున్నట్లు నిరూపిస్తే వరంగల్ లోకసభ నుంచి కడియం కావ్య తప్పుకుంటుందని స్పష్టం చేశారు. మంద కృష్ణ మాదిగ జాతి ద్రోహి అని కడియం శ్రీహరి ఆరోపించారు. దళితులు, ముస్లింలు ఇతర మైనారిటీలపై బీజేపీ ఆరాచకంగా వ్యవహరిస్తుంటే.. ఆ పార్టీ పంచన ఎలా చేరుతారని శ్రీహరి ప్రశ్నించారు. మందకృష్ణ మాదిగ దళిత జాతి ఉద్ధారకుడని ఎలా అంటామని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి కొమ్ము కాస్తూ దళిత జాతి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నాడని మండిపడ్డారు.

రమేశ్‌కు ఓటమి భయం పట్టుకుంది

బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్‌కు ఎన్నికకు ముందే ఓటమి భయం పట్టుకుందని కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య విమర్శించారు. తన వ్యక్తిగత విషయాలను రాజకీయం చేయడంలోనే రమేశ్ పతనం ప్రారంభమైందన్నారు. ఆయనకు డిపాజిట్ కూడా దక్కదన్నారు. వర్ధన్నపేటలో భూకబ్జాలు చేసింది చాలక ఇక మిగతా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కబ్జాల కోసమే ఎంపీగా పోటీ చేస్తున్నాడని రమేశ్‌పై మండిపడ్డారు.

కావ్య గెలుపునకు కృషి

డాక్టరు కావ్య విజయం కోసం సమష్టిగా కృషి చేస్తున్నట్లు వరంగల్ లోకసభ ఇన్‌చార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వెల్లడించారు. కావ్య వ్యక్తిగత విషయాలపై బీజేపీ, బీఆర్ఎస్ నోరు పారేసుకోవడం ఆ పార్టీల అభద్రతకు సంకేతమన్నారు. బీఆర్ఎస్ అవినీతి ఊబిలో కూరుకుపోయిందన్నారు. కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్టు దోపిడీ బట్టబయలైందన్నారు. కవిత లిక్కర్ కేసులో చిక్కుకుందన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మరో పెద్ద తలకాయ ఒకటి రెండు రోజులు బయటపడనుందని రేవూరి ప్రకాశ్‌రెడ్డి వెల్లడించారు. కరువు యాత్ర పేరిట రైతులపై కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని దుయ్యబట్టారు. ఖమ్మంలో రైతులకు సంకేళ్లు వేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కావ్య మూడు లక్షల మెజారిటీతో విజయం సాధించడం ఖాయమన్నారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కబ్జాల చరిత్ర ఉన్న అరూరి రమేశ్‌కు కడియం శ్రీహరి, కావ్యను విమర్శించే నైతిక హక్కు లేదని విమర్శించారు. కబ్జాల పాపం వల్లే అరూరి రమేశ్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓడించారని, ఎంపీగా కూడా ఇదే అనుభవం ఆయనకు దక్కనుందని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ దుయ్యబట్టారు. బీఆర్ఎస్‌లో ఉన్న సమయంలో కబ్జాలకు పాల్పడిన రమేశ్ బీజేపీలో చేరగానే పునీతుడు కాలేడని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మండిపడ్డారు. ఈ సమావేశంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీ పసునూరి దయాకర్, కాంగ్రెస్ ఓబీసీ సెల్ రాష్ట్ర చైర్మన్ కత్తి వెంకటస్వామి, వర్ధన్నపేట ఇన్‌చార్జి నమిండ్ల శ్రీనివాస్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా, కార్పొరేటర్ తోట వెంకన్న, బంక సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కడియం ఎమ్మెల్యే కాకముందే
నేను కాంట్రాక్టర్‌ను..

కడియం ఆస్తులను ప్రజలు గమనిస్తున్నారు.. ● ఇన్నాళ్లు అండర్ డ్రైనేజీ ఎందుకు గుర్తురాలేదు? ఏ లబ్ధి కోసం పార్టీ మారారో ప్రజలకు చెప్పాలి.. ● వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి ఆరూరి రమేశ్



మడికొండలోని సత్యసాయి గార్డెన్‌లో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న అరూరి

హనుమకొండ టౌన్, ఏప్రిల్12: కడియం శ్రీహరి ఎమ్మెల్యే కాకముందే 1991లో తాను క్లాస్‌వన్ కాంట్రాక్టర్‌నని, తన ఎదుగుదలలో ఎవరి ప్రమేయం లేదని స్వయంకృషితో, ప్రజల ఆశీస్సులతో రాజకీయ ప్రతినిధిగా ఎదిగానని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ చెప్పారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనం లోక్‌సభ కన్వీనర్ కుమారస్వామి అధ్యక్షతన శుక్రవారం మడికొండలోని సత్యసాయి గార్డెన్‌లో జరిగింది. ఈ సందర్భంగా అరూరి రమేశ్ మాట్లాడుతూ.. ప్రతీసారి నీతి, నిజాయితీకి కేరాఫ్‌గా చెప్పుకుంటున్న కడియం.. వేల కోట్ల ఆస్తులు ఎలా సంపాదించాడో ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. 40 ఏళ్లుగా మంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎంపీ, ఎమ్మెల్సీగా అధికారం అనుభవించి.. ఏనాడూ అండర్ డ్రైనేజీ మాట మాట్లాడనోడు.. ఇవాళ అండర్‌డ్రైనేజీ నిర్మిస్తానని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్ఎస్ టికెట్ ఇస్తే.. ఏంతీసుకొని కాంగ్రెస్ పార్టీలో చేరాడని ప్రజలు చర్చించుకుంటున్నారని విమర్శించారు. మూడోసారి ప్రధాని కాబోతున్న మోదీ బృందంలో ప్రతినిధిగా వరంగల్ నుంచి పంపిస్తే వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. సంగెం, మడికొండ టెక్స్‌టైల్ అభివృద్ధితోపాటు మామునూర్ ఎయిర్‌పోర్టు పునరుద్ధరణ, ఈ ప్రాంత యువత కోసం స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. 10 ఏళ్ల వర్ధన్నపేట ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే.. ఏ విధంగా అభివృద్ధి చేశానో.. ఎంపీగా అవకాశం ఇస్తే రెట్టింపు సేవ చేస్తానని హామీ ఇచ్చారు. వరంగల్ లోక్‌సభ పరిధిలోని జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఇతర నాయకులు తన గెలుపునకు కృషి చేయాలని కోరారు.

నెంబర్ వన్ స్థానంలో వరంగల్

దేశంలోనే వరంగల్ లోక్‌సభ నెంబర్‌వన్ స్థానంలో నిలవబోతుందని తెలంగాణ లోక్‌సభ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్ అన్నారు. బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. దేశవ్యాప్తంగా 400 సీట్లు, రాష్ట్రంలో 12 సీట్లు బీజేపీ కైవసం చేసుకోబోతోందని జోస్యం చెప్పారు. కాగా, అంతకుముందు మండల, డివిజన్, బూత్ అధ్యక్షుల ఇంటింటికీ ప్రచారంపై అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ లబ్ధిదారుల వివరాలు, ఫోన్ నెంబర్లు తప్పనిసరిగా బూత్ అధ్యక్షుల దగ్గర ఉండాలన్నారు. ప్రతీ ఇంటికి మోదీ, అభ్యర్థితో ఉన్న స్టిక్కర్లను పంపిణీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, నాయకులు ధర్మారావు, గరికపాటి మోహన్‌రావు, చాడ సురేశ్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, మురళీధర్, విజయరామారావు, వివిధ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, దశమంత్‌రెడ్డి, నిషిధర్‌రెడ్డి, నాయకులు కీర్తిరెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కొండేటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓట్లు వేయొద్దు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ

న్యూశాయంపేట, ఏప్రిల్ 12: మాదిగల వ్యతిరేక పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓట్లు వేయొద్దని ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ సమాజానికి పిలుపునిచ్చారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని వేద కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంద కుమార్ మాదిగ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మాదిగలను రాజకీయంగా అణచివేస్తోందని, అలాంటి కాంగ్రెస్ పార్టీని రానున్న ఎన్నికల్లో మాదిగలంతా ఏకమై చిత్తుగా ఓడించాలన్నారు. మాదిగలకు మొదటగా టికెట్ ఇవ్వని బీఆర్ఎస్ పార్టీకి కూడా ఓట్లు వేయొద్దన్నారు. ఈ నెల 15వ తేదీన పరకాలలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల లోక్‌సభ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని, పెద్ద సంఖ్యలో మాదిగ కులస్థులు హాజరై విజయవంతం చేయాలని మంద కుమార్ మాదిగ పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్పీ జాతీయ నాయకులు వేల్పుల సూరన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను దినేష్ మాదిగ, ఎమ్మెస్పీ వరంగల్ ఇన్‌చార్జి మంద రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు ఏకు శంకర్, చేతల్ల రమేష్, శివ, శ్రీనివాస్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



గవిచర్ల మోడల్ స్కూల్ ల్యాబ్‌లో పాఠ్యాంశాలను నేర్చుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

అటకెక్కిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు

అవగాహన లేకపోవడంతోనే పూర్తిస్థాయిలో ఏర్పాటు కాని వైనం
ఆన్‌లైన్‌తో ఏమీ చేయాలో తెలియని అవగాహన రాహిత్యం

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12: అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల నిర్వహణ తూతూమంత్రంగా సాగుతోంది. నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో అటల్ ఇన్నోవేషన్ మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల్లో శాస్త్రీయ స్వభావాన్ని పెంపొందించి సృజనాత్మకతతో కూడిన వినూత్న ఆవిష్కరణలను సృష్టించే వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి పాఠశాలల్లో అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల పేరుతో సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తోంది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను శాస్త్రీయ, సాంకేతిక రంగాల వైపు అడుగులు పడేందుకు వారిని ఆ మేరకు ప్రోత్సహించేందుకు ఈ ల్యాబ్‌లను ఉపయోగించాలని సూచిస్తోంది. అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.12లక్షల నిధులను ఎంపికైన పాఠశాలకు మంజూరు చేస్తుంది. ల్యాబ్ ఏర్పాటైన తర్వాత ఒక్కో యేడాదికి రూ.2లక్షలను నిర్వహణ ఖర్చుల కింద మంజూరు చేస్తుంది. వరంగల్ జిల్లా పరిధిలో మొత్తం ఆరు పాఠశాలలు అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు ఎంపిక కాగా, ఇప్పటివరకు రెండు పాఠశాలల్లో మాత్రమే ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. మిగిలిన నాలుగు పాఠశాలల్లో వాటి ఊసే లేదు. హనుమకొండ జిల్లాలో నాలుగు ఎంపిక కాగా, రెండు మాత్రమే ఏర్పాటయ్యాయి. టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు సంబంధించిన అంశాలు పూర్తిగా ఆన్‌లైన్‌తోనే ముడిపడి ఉండటం, రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఎలాంటి సమాచారం లేకపోవడంతో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పూర్తి స్థాయిలో అవగాహన ఉండటం లేదు. దీంతో ఎంపికైన పాఠశాలల్లో సైతం ల్యాబ్‌ల ఏర్పాటు జరగడం లేదు.

అంతా ఆన్‌లైన్‌తోనే ఇబ్బంది

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లనే ఏర్పాటు చేసుకోవాలంటే సంబంధిత నీతి ఆయోగ్ వెబ్‌సైట్‌లోనే విధివిధానాలు పొందుపరిచి ఉంటాయి. ఇక పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఈపథకానికి సంబంధించి ఎలాంటి సమాచారం తెలియదు. వారి పర్యవేక్షణ లేకుండానే కేంద్ర ప్రభుత్వం నేరుగా పథకాన్ని అమలు చేస్తుంది. దీంతో టింకరింగ్ ల్యాబ్ ఏర్పాటుకు అన్ని అర్హతలు కలిగి ఉన్న పాఠశాలలు సైతం దరఖాస్తు చేసుకోలేకపోతున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారులకే అవగాహన లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులకు సైతం ఎలాంటి ముందస్తు అవగాహన కల్పించలేకపోతున్నారు. అవగాహన రాహిత్యంతో ల్యాబ్‌ల ఏర్పాటుకు అడ్డంకిగా మారుతుంది.

శాస్త్రీయభావాన్ని పెంపొందించేందుకు..

పాఠశాలల్లో టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థుల్లో శాస్త్రీయ భావాన్ని పెంపొందుతుంది. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశం కూడా అదే. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ భావన పెంపొందించి తద్వారా వినూత్న ఆలోచనలతో సృజనాత్మక ఆవిష్కరణలు చేస్తారనే ఈ ల్యాబ్‌ల ఏర్పాటుకు పూనుకుంది. పాఠశాలల్లోనే శాస్త్ర, సాంకేతిక వాతావరణాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులను వినూత్న ఆవిష్కరణలవైపు పయనించేలా చేయడమే టింకరింగ్ ల్యాబ్‌ల ఆశయం.

ఏర్పాటుకు రూ.12లక్షలు, నిర్వహణకు రూ.2లక్షలు

కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో తొలుత ల్యాబ్‌ల ఏర్పాటుకు రూ.12లక్షల నిధులను ఎంపికైన పాఠశాలకు మంజూరు చేస్తుంది. ఆ తరువాత ప్రతీ యేడు నిర్వహణ ఖర్చుల కింద రూ.2లక్షల నిధులు మంజూరు చేస్తుంది. వరంగల్ జిల్లాలో మొత్తం ఆరు పాఠశాలలు ఈ పథకానికి ఎంపిక కాగా, రెండు పాఠశాలల్లోనే పూర్తిస్థాయిలో ల్యాబ్‌లు ఏర్పాటు అయ్యాయి. మిగతా నాలుగు పాఠశాలల్లో ఎలాంటి ముందడుకు పడలేదు. గవిచర్ల, పర్వతగిరి మోడల్ స్కూళ్లలో టింకరింగ్ ఏర్పాటు అయ్యాయి. ఇక ఎంపికైన ఖానాపురం మండలం బుధరావుపేట మోడల్ స్కూల్, ధర్మారం జడ్పీహెచ్ఎస్, నెక్కొండ జడ్పీహెచ్ఎస్, నర్సంపేటలోని జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాలల్లో టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు అడుగులు పడలేదు. ఇక హనుమకొండ జిల్లాలో నాలుగు టింకరింగ్ ల్యాబ్‌లకు ఎంపిక కాగా, కేవలం మడికొండలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, ఎల్కతుర్తిలోని మోడల్ స్కూల్లో మాత్రమే టింకరింగ్ ల్యాబ్‌లు ఏర్పాటయ్యాయి.

మాకు సమాచారం ఉండటం లేదు..

అటల్ టింకరింగ్ ల్యాబ్‌లకు సంబంధించిన ఎలాంటి సమాచారం మాకు అందుబాటులో ఉండటం లేదని విద్యాశాఖాధికారులు చెబుతున్నారు. అలాగే జిల్లా సైన్స్ అధికారులకు సైతం ఎలాంటి సమాచారం ఉండటం లేదని వారు చెబుతున్నారు. పూర్తిగా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. మాకు ఎలాంటి సమాచారం లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించలేకపోతున్నాము. ఆసక్తి కలిగిన ప్రధానోపాధ్యాయులు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేస్తున్నారు. జిల్లాలో ఎన్ని పాఠశాలలు టింకరింగ్ ల్యాబ్‌ల ఏర్పాటుకు ఎంపికయ్యాయనే కనీస సమాచారం సైతం మాకు అందుబాటులో ఉండటం లేదు.



కేసీఆర్ ఫామ్‌హౌస్ సమీపంలో నాయకులతో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

నిరుత్సాహంలో తాటికొండ రాజయ్య

ఎర్రవెల్లికి వెళ్లి వెనుదిరిగిన మాజీ ఎమ్మెల్యే

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 12: బీఆర్ఎస్ వరంగల్ లోక్‌సభ టికెట్ విషయంలో స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్యకు చుక్కెదురైంది. కేసీఆర్ నుంచి ఏ క్షణం లోనైన ఫోన్ వస్తుందని, అందుబాటులో ఉండాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమాచారం ఇచ్చారు. అయితే హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ కేసీఆర్‌తో ఫామ్‌హౌస్‌లో చర్చలు జరుపుతున్నాడనే విషయం తెలుసుకున్న రాజయ్య.. ఎర్రవెల్లికి వెళ్లకుండా సమీప గ్రామంలో నాయకులతో కలిసి వేచి ఉన్నాడు. ఈ క్రమంలోనే వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థిగా సుధీర్‌కుమార్ పేరు కేసీఆర్ ప్రకటించడంతో అసహనానికి గురైన రాజయ్య ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌ను కలువకుండానే వెనుదిరిగి వచ్చారు. కాగా కేసీఆర్ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ బాధ్యతలు, వరంగల్ లోక్‌సభ అభ్యర్థి గెలుపు బాధ్యతలు రాజయ్యను తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. రాజయ్య వెంట వెళ్లిన నాయకులు ఆకుల కుమార్, చల్లా చందర్ రెడ్డి, కేశిరెడ్డి మనోజ్ రెడ్డి, కనకం గణేష్, రంగు హరీష్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మృతి చెందిన మహిళ

వరంగల్ క్రైం, ఏప్రిల్ 12: రోడ్డు ప్రమాదంలో చాపర్తి సాంబలక్ష్మి (56) అనే కూలీ మృతిచెందిన సంఘటన సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సాంబలక్ష్మీ శుక్రవారం ఉదయం ఇళ్లలో పనిచేసి వస్తూ హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద కూరగాయలు తీసుకుంటుండగా ఆటో వచ్చి ఢీ కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 ఫోన్ చేసి ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ సాంబలక్ష్మీ మృతి చెందింది. మృతురాలి కుమారుడు రాజమౌళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, ఏప్రిల్12: నిబంధనలు ఉల్లఘించిన 17 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ షూకూర్ తెలిపారు. 17 మందిని బుధవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రమేశ్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 12 మందికి 17,300, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ ఐదుగురికి రూ.4,200 జరిమానాను విధించారన్నారు.

ఇక సమరమే!



(5వ పేజీ తరువాయి)

కావ్య ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ సైతం ఇప్పటికే అన్ని నియోజకవర్గాలల్లో ఒకసారి విస్తృత స్థాయి సమావేశాలు నిర్వహించారు. పార్లమెంట్ స్థాయిలో బూత్ కమిటీల సమావేశాలు కూడా నిర్వహించి కార్యకర్తల్లోకి చొచ్చుకు పోతున్నారు. మోదీని మూడోసారి ప్రధానమంత్రిని చేసేందుకు తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి శుక్రవారమే ఖరారవటంతో గెలుపే లక్ష్యంగా ప్రజాక్షేత్రంలో దిగి గులాబీ పార్టీ కార్యాచరణ రూపొందిస్తోంది.

మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్, బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత, బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్ ఇప్పటికే పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ముఖ్యనేతల సమావేశాలు నిర్వహిస్తున్నారు. తమ గెలుపునకు సహకరించాలని, గెలిస్తే నియోజకవర్గంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల గురించి వివరిస్తున్నారు. మండుటెండలో కూడా అభ్యర్థులు ప్రచారంలో చెమటోడ్చుతున్నారు.

ఓట్ల లెక్కల్లో నేతలు..

2009లో జరిగిన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనలో హనుమకొండ పార్లమెంట్ స్థానం పరిధిలో వరంగల్ లోక్‌సభ ఏర్పడింది. తొలుత జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించగా, 2014, 2016 (ఉపఎన్నిక), 2019లో వరుసగా బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. అలాగే మహబూబాబాద్ నుంచి 2009లో కాంగ్రెస్ విజయం సాధించగా, 2014, 2019లో వరుసగా బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఒక చోట బీఆర్ఎస్ విజయం సాధించింది. మొత్తం కాంగ్రెస్‌కు 6,61,545ఓట్లు పోలవగా, బీఆర్ఎస్‌కు 5,02,578ఓట్లు వచ్చాయి. ఇక బీజేపీకి 1,56,353ఓట్లు పోలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై 1,58,967ఓట్ల ఆధిక్యాన్ని కాంగ్రెస్ సాధించింది. అయితే వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో బీజేపీకి గణనీయమైన ఓట్లు పోలయ్యాయి. దీంతో పాటు వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ చేరికతోపాటు ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉండటంతో వర్ధన్నపేటలో కూడా బీజేపీకి కొంత బలం పెరిగిందనే చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరటంతో పాటు తన కూతురు కావ్యను ఎంపీ అభ్యర్థిగా బరిలో దించటంతో కాంగ్రెస్‌కు అదనపు బలంగా భావిస్తున్నారు. దీంతో వరంగల్ పార్లమెంట్ స్థానంలో ట్రయింగిల్ ఫైట్ ఏర్పడింది. మహబూబాబాద్ ఎంపీ స్థానంలో కూడా ఏడింటిలో ఆరు చోట్ల కాంగ్రెస్ విజయం సాధించగా, ఒక చోట బీఆర్ఎస్ ఎమ్మెల్యే గెలిచారు. అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్‌కు 6,85,897ఓట్లు పోలు కాగా, బీఆర్ఎస్‌కు 4,43,910 ఓట్లు వచ్చాయి. బీజేపీకి ఇక్కడ కేవలం 34,426 ఓట్లే పోలయ్యాయి. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌పై 2,41,987ఓట్ల ఆధిక్యతను కాంగ్రెస్ సాధించింది. అయితే భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌లో చేరటంతో కాంగ్రెస్‌కు అనదపు బలం చేకూరిందనే చర్చ జరుగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2009 నుంచి 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు పార్టీలకు సంప్రదాయంగా వస్తున్న ఓట్లను పరిగణంలోకి తీసుకుని ఆయా పార్టీల నేతలు గెలుపు లెక్కలు వేస్తున్నారు. దీంతో ఒక్కసారిగా ఓరుగల్లు రాజకీయాలు హీటెక్కుతున్నాయి.

2009 నుంచి 2023 అసెంబ్లీ ఎన్నికల వరకు ఆయా పార్టీలకు పోలైన ఓట్లు

లోక్‌సభ స్థానం	సంవత్సరం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
వరంగల్	2009	3,96,568	2,71,907	1,35,697(టీడీపీ)
వరంగల్	2014	2,69,065	6,61,639	1,87,139
వరంగల్	2016	1,56,315	6,15,403	1,29,868
వరంగల్	2019	2,62,200	6,12,498	83,777
అసెంబ్లీ ఎన్నికలు	2023	6,61,545	5,02,578	1,56,353
మహబూబాబాద్	2009	3,94,447	3,25,490(సీపీఐ)	1,45,299(పీఆర్‌పీ)
మహబూబాబాద్	2014	2,85,577	3,20,569	2,15,904 (టీడీపీ)
మహబూబాబాద్	2019	3,15,446	4,62,109	25,487(బీజేపీ)
అసెంబ్లీ ఎన్నికలు	2023	6,85,897	4,43,910	34,426(బీజేపీ)

బీఆర్ఎస్ అభ్యర్థిగా మారపెల్లి



(5వ పేజీ తరువాయి)

కేసీఆర్ విముఖత వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ క్రమంలో కేసీఆర్ అనూహ్యంగా సుధీర్‌కుమార్‌ను ప్రకటించడంతో నేతలంతా అధినేత నిర్ణయానికి తప్పనిపరిస్థితిలో ఒప్పుకున్నట్లు సమాచారం. మొత్తంగా రాజయ్యకే వరంగల్ ఎంపీ టికెట్ వస్తుందని ప్రచారం జరుగుతున్న క్రమంలో కేసీఆర్ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ పేరును ప్రకటించడం గమనార్హం.

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన సుధీర్‌కుమార్ ప్రస్తుతం హనుమకొండ జడ్పీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. భీమదేవరపల్లి మండల పరిషత్ అధ్యక్షుడిగా (1995-2000), కరీంనగర్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా (2001-2006) కాలంలో పదవిలో ఉన్నారు. 2001 నుంచి బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న సుధీర్‌కుమార్.. మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావుకు ప్రధాన అనుచరుడు.

సుధీర్‌కుమార్‌కు కేసీఆర్ ఫోన్

సుధీర్‌కుమార్‌కు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫోన్ చేసి ఆశీర్వదించారు. సుధీర్‌కుమార్ నివాసం, విద్యాభ్యాసం, వరంగల్‌తో ఉన్న అనుబంధం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని తేలిందన్నారు. వరంగల్‌లో గెలిచేది బీఆర్ఎస్ అని ఆయన తెలిపారు. జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలను వెళ్లి కలవాలని కేసీఆర్ సూచించారు. 15న సమన్వయ కమిటీ సమావేశం ఉంటుందని, జిల్లా నేతలను అందరిని కలిసి సహకారం తీసుకుని విజయం సాధించాలని కేసీఆర్ సూచించారు. కాగా, ఈ సందర్భంగా తనకు అవకాశం కల్పించిన కేసీఆర్‌కు, సహకరించిన జిల్లా నేతలకు సుధీర్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి

● పార్టీ అర్బన్ అధ్యక్షుడు అంజయ్య

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 12 : మానుకోట పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ గెలుపుకోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారంచేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా ఆరు గ్యారంటీలను అమలుచేస్తుందన్నారు. ప్రభు త్వం అమలు చేస్తున్న పథకాలే మేనెలలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో మానుకోట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్‌నుగెలిపిస్తాయని పేర్కొన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలోకి రాబోతుందని వివిధ సర్వేలు చెబుతున్నాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పార్టీకే మద్దతు పలుకుతున్నారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుస్తోందని



మానుకోటలో ఎంపీ అభ్యర్థి బలరాంనాయక్ గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తున్న ఘనపురపు అంజయ్య

పేర్కొన్నారు. నాయకులు నూనావత్ రాధ, పిండ్రాల రాందాస్, ప్రసాద్‌నాయక్, రియాజ్ అన్సారీ, వంశీ, విజయలక్ష్మీ, స్వర్ణలత, సత్యమనోరమ, పూర్ణచందర్, చిరంజీవి, కార్తీక్, సలీం, శ్రీకాంత్, రామరాజు, ఉపేందర్, దేవ్‌సింగ్, అరుణ్, రిజ్వాన్, నవీన్, యాకన్న, వీరన్న, భాస్కర్, మీయ, వెంకన్న, కలీం పాల్గొన్నారు.

అడవుల అభివృద్ధికి ప్రణాళికలు

● వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు

● సాసర్ పిట్లు, నీటి కుంటల తవ్వకాలు

గూడూరు, ఏప్రిల్ 12 : ఎండ తీవ్రత రోజురోజుకు అధికమవుతోంది.. అడవుల్లో నీటి వనరులు అడుగంటిపోయి వన్యప్రాణులు అల్లాడుతున్నాయి. దట్టమైన వనాలు, ఆకురాల్చడంతో అటవీ జంతువులు తమ స్థావరాలను వీడి ఆగమవుతున్నాయి. నీళ్లు, ఆహారం కోసం వనాలనుదాటి బయటకు వచ్చి దారి తప్పుతూ గ్రామాల్లోకి వస్తున్నందున అటవీశాఖ అప్రమత్తమైంది. వన్యప్రాణులకు ఎలాంటి హానీ తలపెట్టవద్దని అవగాహన సదస్సులను నిర్వహించారు. వేసవిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

అభయారణ్యంలో చెక్‌డ్యాంల నిర్మాణం..

గూడూరు అభయారణ్యంలో వివిధ రకాల వన్యప్రాణులు, మృగాలు దాహార్తిని తీర్చేలా నిర్మాణాలు చేపట్టారు. ఇందులో ముఖ్యంగా వానకాలంలో గుట్టలు, ఎత్తైన ప్రాంతాల నుంచి వృథాగా పోయే వరద ప్రవాహాన్ని ఒడిసి పట్టేలా అటవీశాఖ



సీసీ కెమెరాలో నమోదైన జింక నీరు తాగుతున్న దృశ్యం

అధికారులు నిర్మాణాలు చేపట్టారు. పెద్ద మొత్తంలో నీటిని నిల్వ చేసేందుకు చెక్‌డ్యాంలు నిర్మించారు. వరద ప్రవాహ మార్గాలు, నీటి కోసం వన్య ప్రాణులు సంచరించే మార్గాలను శాస్త్రీయంగా గుర్తించి చెక్‌డ్యాంలు, పర్క్యులేషన్ ట్యాంకుల నిర్మాణాలను చేపట్టారు. నీళ్లు అందుబాటులో ఉండడంతో అడవిని దాటి జంతువులు బయటకు వెళ్లే అవకాశం ఉండదు.

సాసర్‌పిట్, సిమెంట్ కుండీల్లో నీటినిల్వ

మార్చి నుంచి ఎండ తీవ్రతతో పాటు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండడంతో అటవీ ప్రాంతాల్లో సహజ సిద్ధమైన నీటి వనరులు అడుగంటిపోతాయి. చెక్‌డ్యాంలు సైతం ఎండిపోయి అడవి జంతువులకు ఇబ్బందిగా మారుతుంది. అడవుల్లో ఉన్న వృక్షాలు ఆకు రాల్చడంతో సరైన ఆహారం లభించని పరిస్థితి ఉంటుంది. జింకలు, కనుజులు, దుప్పులు, ఎలుగుబంట్లు, కుందేళ్లు, అడవి పందులు, నక్కలు, హైనాలు, ఇతర వన్యప్రాణులు, పక్షుల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేక నిర్మాణాలు చేపట్టారు. జంతువులు సంచరించే మార్గాలలో నీటి నిల్వ కోసం సాసర్‌ఫిట్ (నీటితొట్టి), సిమెంట్ ఓడలతో నిర్మాణాలు చేపడుతారు. వీటిల్లో ప్రతిరోజు ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతుండడంతో వన్యప్రాణులు, జంతువులు, పక్షుల దాహార్తి తీరుతుంది.

సీసీ కెమెరాల ఏర్పాటు..

వన్య ప్రాణులను వేటగాళ్ల ఉచ్చుల నుంచి కాపాడడానికి అటవీశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంది. వేటగాళ్లపై నిరంతర నిఘా పెట్టి వారి కదలికలను నియంత్రిస్తున్నారు. అభయారణ్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు రాత్రి



గూడూరు అభయారణ్యంలో జంతువుల దాహార్తిని తీర్చేందుకు సాసర్‌పిట్లను నీటితో నింపుతున్న సిబ్బంది

వేళల్లో బేస్‌క్యాంప్ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నారు. నిఘాతో పాటు కొరియర్ వ్యవస్థను పటిష్ఠం చేస్తున్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

● బి.సురేష్, ఎఫ్ఆర్వో, గూడూరు



అడవుల అభివృద్ధి, వన్య ప్రాణుల దాహార్తిని తీర్చడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం. వేసవికాలం సమీపిస్తుండడంతో వన్యప్రాణుల దాహార్తిని తీర్చ డానికి 4 చెక్‌డ్యాములు, 15 నీటికుంటలు, 10 సాసర్‌ఫీట్‌లు, 30 సాసర్ రింగ్‌లు, 5 సోలార్ పంప్ సెట్‌లు నిర్మాణాలు పూర్తి చేశాం. ప్రతిరోజు ఆయా వాటిల్లో ట్యాంకర్, బోర్లద్వారా నీటిని నింపుతున్నాం. అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులను వేటాడితే కఠినచర్యలు తప్పవు. 1972 వన్యప్రాణి చట్టం ప్రకారం శిక్షలు అమలు చేస్తాం.

మళ్లీ మోదీనే ప్రధాని కావాలి

● బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకన్న

కేసముద్రం, ఏప్రిల్ 12 : దేశానికి నరేంద్ర మోదీనే మళ్లీ ప్రధాని కావాలని ప్రజలు కోరుకుంటున్నారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రడం వెంకన్న అన్నారు. కేసముద్రం స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మోదీ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు దేశరక్షణ విధానంపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని అన్నారు. ఈ క్రమంలోనే బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్ గెలుపుకోసం ఈనెల 13న మానుకోట బాలాజీగార్డెన్స్‌లో నిర్వహించే పార్లమెంటు బూత్‌స్థాయి సమ్మేళనానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కోశాధికారి వేలం శ్రీనివాస్, కార్యదర్శి రామడుగు వెంకటాచారి, గాంతి వెంకట్‌రెడ్డి, బోనగిరి ఉపేందర్, లెంకలపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'నిరంతర సాధనతో విజయం'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12 : పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధనతో విజయం సాధించవచ్చని నలంద డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ అన్నారు. మహబూబాబాద్‌లోని నలంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం భాగ్యనగర్ ఇనిస్టిట్యూట్ రూపొందించిన వివిధ ఉద్యోగ నియామక పోటీ పరీక్షల వాల్ పోస్టర్లను ఆవిష్కరించి, పోటీ పరీక్షల మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భాగ్యనగర్ ఇన్స్టిట్యూట్ తయారు చేసిన పోటీ పరీక్షల మెటీరియల్ కళాశాల విద్యార్థులకు అందజేసిన ఇన్స్టిట్యూట్ ఛైర్మన్ మాల్యాద్రి, డైరెక్టర్ వెంకట్‌రెడ్డిలకు సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.బి. శంకర్ పారామెడికల్ ఇన్‌చార్జ్ కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి పదవీవిరమణ తప్పదు

● ఏఎస్పీ జోగుల చెన్నయ్య

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 12 : ప్రతీ ఉద్యోగికి పదవీవిరమణ తప్పదని, చివరి శేషజీవితాన్ని కుటుంబసభ్యులతో ఆనందంగా గడపాలని మహబూబాబాద్ ఏఎస్పీ జోగుల చెన్నయ్య అన్నారు. అడిషనల్ ఎస్పీ కార్యాలయంలో పదవీవిరమణ పొందిన హోంగార్డ్ ఆఫీసర్ రాంజీని శాలువతో సత్కరించి మెమోంటో అందించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ పదవీవిరమణ పొందిన ఉద్యోగులు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పదవీవిరమణ పొందిన సిబ్బందికి ఎలాంటి సమస్యలు తలెత్తిన పోలీసశాఖ అండగా ఉంటుందన్నారు. ఆర్ఐ హోంగార్డ్స్ భాస్కర్, ఆర్ఐ సోములు ఉన్నారు.

'వేధింపులకు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేయాలి'

తొర్రూరు, ఏప్రిల్ 12 : తొర్రూరు ప్రాథమిక సహకార సంఘం సొసైటీలో పనిచేస్తున్న దళిత మహిళను వేధింపులకు గురిచేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ శుక్రవారం తొర్రూరులోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత ప్రజాప్రతినిధి, జడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ మహిళలకు రక్షణ కరువైందన్నారు. ఒక దళిత మహిళ తనను వేధింపులకు గురి చేశాడని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి పదిరోజులు దాటినా ఇప్పటి వరకు నిందితుడిపై చర్యలు తీసుకోకుండా అలసత్వం వహించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. వెంటనే నిందితుడు, సొసైటీ సీఈవో మురళిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. దళిత సంఘాల నాయకులు ఎస్.కొమురయ్య, టి. అశోక్, రాయిశెట్టి వెంకన్న, వెంకటసాయిలు, సంజీవ, ఐలయ్య నాగన్న, ఉపేందర్, యాకేందర్ ఉన్నారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన పద్మశాలి సంఘం బాధ్యులు



హైదరాబాద్‌లో ప్రభుత్వ సలహదారు వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న పద్మశాలి సంఘం బాధ్యులు

కేసముద్రం, ఏప్రిల్12 : కేసముద్రంలో పద్మశాలి సంఘ భవన నిర్మాణానికి సహాయ సహకారాలు అందించాని కోరుతూ హైదరాబాద్‌లో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని ఆ సంఘం బాధ్యులు కలిసి విజ్ఞప్తి చేశారు. సంఘం మండల అధ్యక్షుడు సామల నర్సయ్య, ఉపాధ్యక్షుడు కాముని కుమారస్వామి, కోశాధికారి మామిడాల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు చిట్యాల వీరన్న, చెలమల్ల కిరణ్, బొద్దుల సతీష్, గుండు శ్రీనివాస్, బేతు వెంకన్న, సామల రమేష్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, జింజిరాల సోమేశ్వర్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు త్వరతగతిన చర్యలు

● మానుకోట మునిసిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 12 : తాగునీటి ఎద్దడి నివారణకు త్వరితగతిన చర్యలు చేపడుతున్నట్లు మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధి సాలారుతండా 7వ వార్డును శుక్రవారం సందర్శించి, తండ సమీపంలోని వ్యవసాయ బావులను పరిశీలించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా ప్రజలతకు తాగు నీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు చేపడుతున్నచర్యల్లో భాగంగా సమీపంలోని బావుల్లో పూడికతీయించి ప్రజలకు నీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మిషన్‌భగీరథ నీటిసంపు సమస్యలను పరిశీలించి, మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. చైర్మన్ వెంటవార్డు కౌన్సిలర్ జాటోత్ సుజాతరంగ్యా, దౌలాగర్ శంకర్, జగన్ ఉన్నారు.

విజయ సంకల్ప సభను జయప్రదం చేయాలి

మరిపెడ, ఏప్రిల్ 12: జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహిస్తున్న బీజేపీ పోలింగ్ బూత్ విజయ సంకల్ప సభకు మరిపెడ మండలంలోని అన్ని పోలింగ్ బూత్ కమిటీల బాధ్యులు పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మరిపెడ మండల అధ్యక్షుడు కట్టోజ్ గంగాధర్ కోరారు. శుక్రవారం స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆయన మరిపెడలో మాట్లాడారు. వెంకట్‌రెడ్డి, బోడా రమేశ్, బింగి రమేశ్, సుధాకర్‌నాయక్, కొంపల్లి మధు, అనంతుల సురేశ్, శక్రు తదితరులు పాల్గొన్నారు.

'మహనీయుల సిద్ధాంతాలను ఆచరించాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12 : మహనీయుల సిద్ధాంతాలు, మార్గాలను ఆచరించడమే వారికి మనమిచ్చే నిజమైన నివాళి అని ప్రముఖవైద్యుడు బానోత్ నెహ్రూరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ ఐఎంఏ హాల్‌లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మహాత్మాజ్యోతిరావు పూలె, బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నెహ్రూరాథోడ్ మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు సమాజంలో అట్టడుగు వర్గాలకు చెందిన విద్యార్థులను చైతన్యవంతం చేయాలన్నారు. లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్ మాట్లాడుతూ అనేక ఏళ్లుగా చదువుకు దూరమైన దళిత, గిరిజన, బహుజన వర్గాలకు చైతన్యదీపికగా, సూర్యుడిలా మహనీయులు బాటలు వేశారని పేర్కొన్నారు. డాక్టర్ సుందర్‌నాయక్, పార్నంది రామయ్య, చాగంటి ప్రభాకర్, వీరునాయక్, రాంసుందర్‌రావు, హల్యానాయక్, గణేష్, హరినాయక్, బిక్షపతి, ఉప్పలయ్య శివ, వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల బాధ్యులు భోజ్యానాయక్, రంగన్న, భద్రునాయక్, భాస్కర్‌నాయక్ పాల్గొన్నారు.

'కేంద్రప్రభుత్వ విధానాలతోనే నిరుద్యోగం'

డోర్నకల్, ఏప్రిల్ 12 : కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి దేశంలోని నిరుద్యోగం పెరిగిపోతోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. డోర్నకల్ మండల సీపీఐ పార్టీ సమావేశం శుక్రవారం ఆ పార్టీ మండల కార్యదర్శి తురక రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎన్నడు లేని విధంగా 27 శాతం నిరుద్యోగ రేటు పెరిగిందని, అలాగే పేదరికం, నిత్యావసర సరుకుల ధరలు పెరిగి సామాన్యుల బతుకు భారంగామారిందన్నారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతుందని, ప్రజాస్వామ్య మూల సూత్రాలను తుంగలో తొక్కి ఉద్దేశపూర్వ మత రాజకీయాలను రెచ్చగొడుతున్నారని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు ప్రబేష్, జన్ను స్వామి, భూక్య వాల్య పాల్గొన్నారు.

ఫార్మసిస్టు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వేణు



పెద్దవంగర, ఏప్రిల్ 12 : ఫార్మసిస్టు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని చిట్యాలకు చెందిన తన్నీరు వేణును నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తిని సత్యనారాయణగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగాఎన్నికైన జిల్లా అధ్యక్షుడు తన్నీరు వేణు మాట్లాడుతూ ఫార్మసిస్టు సంక్షేమ సంఘం అభివృద్ధికి అందరి సమన్వయంతో పని చేస్తానని, ఫార్మసిస్టుల హక్కులు సాధనకు కృషి చేస్తానని తెలిపారు. ప్రజా ఆరోగ్య రక్షణకు సహకారం అందిస్తామన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆదివాసీలపై ప్రభుత్వం చిన్నచూపు

డోర్నకల్, ఏప్రిల్ 12 : రాష్ట్రంలో ఆదివాసీల పట్ల ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపిస్తోందని ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పసుల బుచ్చయ్య ఆరోపించారు. డోర్నకల్ మండలం బూరుగుపాడులో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనులకు కల్పించిన రిజర్వేషన్లు ఆదివాసీలకు అందని ద్రాక్షగానే మిగిలిపోయాయని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఆదివాసీలకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వాలు ఏమాత్రం కూడ పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్య, ఉపాధి, ఉద్యోగాలలో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పులి శ్రీను, నాయకులు దబ్బ శ్రీను, చిర్ర శ్రీను, దబ్బ వెంకన్న, వీరభద్రం, ముత్యాలరావు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఎండిన పంటలకు నష్టపరిహారం అందించాలి'

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 12 : ఎండిన పంటలకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని ప్రజాపంథా జిల్లా కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్ ఆ పార్టీ కార్యాలయంలో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంట్ కోతలతో ఎండిన వరి, మొక్కజొన్న, ఉద్యానవన పంటలకు ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలతో చివరిదశలో ఉన్న వరి, మొక్కజొన్న, కూరగాయాలు, పూల తోటలు, మామిడి, నిమ్మతో పాటు ఇతరత్రా పంటలు నీరు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు నష్టపోయిన రైతాంగాన్ని గుర్తించి వారికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బండపల్లి వెంకటేశ్వర్లు, ముంజంపల్లి వీరన్న, ఉమగాని సత్యం, జానికిరాములు, ఆలకుంట్ల కొమురయ్య, పైండ్ల యాకయ్య పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 12 : మహబూబాబాద్ మండలం కంబాలపల్లి గ్రామశివారులో ఉన్న గుడుంబా స్థావరాలపై మానుకోట రూరల్ ఎస్సై దీపికరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో సుమారు 3 వేల లీటర్ల గుడుంబా పానకాన్ని ధ్వంసం చేసి 5 లీటర్ల ఐడీ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈసందర్భంగా దీపికరెడ్డి మాట్లాడుతూ కంబాలపల్లి గ్రామశివారులోని ఓవ్యవసాయ బావి వద్ద గుడుంబా కాస్తున్నారన్న పక్కా సమాచారంతో దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకోదండ రామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు

గూడూరు, ఏప్రిల్ 12 : మండలంలోని అప్పరాజుపల్లి గ్రామంలో శుక్రవారం శ్రీకోదండరామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠాత్సవాలు, విగ్రహా ప్రతిష్ఠ కార్యక్రమాలను పురస్కరించుకుని పూజలు నిర్వహించారు. ద్వార తోరణ పూజ, మూర్తికుంభ ఆరాధన, సంక్షేప రామాయణ హోమాలు, మూలమంత్ర హోమం, నిత్యపూర్ణహుతి, తీర్థప్రసాదాలు కార్యక్రమాలనుచేపట్టారు. మాజీ సర్పంచ్ మాధవపెద్ది విజయశ్రీ-విజేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మాధవపెద్ది గీతా-అమరేందర్‌రెడ్డి, లింగాల సుధీర్‌రెడ్డి-రాధిక, మాజీజడ్పీటీసీ ధర్మారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచి వెంకటేశ్వర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు మేరెడ్డి సురేందర్, వేముల వెంకటేశ్వర్లు, చందర్, జయపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యశ్వంత్‌కు ఆర్థిక చేయూత

మరిపెడ, ఏప్రిల్12 : మౌంటెనర్ యశ్వంత్‌కు ఆర్థిక చేయూతనందిస్తానని ట్రాన్స్‌కో కురవి సెక్షన్ ఏడీఏ అంగోత్ రమేశ్‌నాయక్ హామీ ఇచ్చారు. కొద్ది రోజులుగా వివిధ ప్రచార మాధ్యమాలలో మౌంటెనర్ యశ్వంత్ ఎవరెస్ట్ శిఖరానికి చేరువ అవుతుండగా, పేదరికం అడ్డొస్తుందని తెలుసుకున్న రమేశ్‌నాయక్ శుక్రవారం యశ్వంత్‌ను ఖమ్మంలోని ఆయన నివాసానికి పిలుచుకొని యశ్వంత్ ధైర్యసాహసలను మెచ్చుకొన్నారు. పర్వతారోహణ అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరెస్ట్ శిఖర అధిరోహణకు ఆర్థిక సహాయం అందచేస్తానని హామీ ఇచ్చినట్లు యశ్వంత్ విలేకరులకు తెలిపారు.

బీజేపీ గెలుపు ఖాయం



బస్సులను ప్రారంభిస్తున్న శ్రీమాన్

తొర్రూరు, ఏప్రిల్ 12 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ బీజేపీ పార్లమెంటరీ అభ్యర్థి ఆరూరి రమేష్ గెలుపు ఖాయమని ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్ అన్నారు. శుక్రవారం వరంగల్‌లో జరిగిన పార్లమెంట్ బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనానికి తరలుతున్న వాహనాలను జెండా ఊపి ప్రారంభించి, తొర్రూరులో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధిస్తుందన్నారు. నరేంద్రమోదీ మూడోసారి ప్రధాని అవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థిగా ఆరూరి రమేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గం నుంచి పది బస్సుల్లో కార్యకర్తలను సమావేశానికి తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పల్లె కుమార్, సురేష్, రాజేష్, యాకయ్య, శేఖర్, భరత్, విజయ్, నవీన్, రాంబాబు, శివ, విష్ణువర్ధన్ చారి, సందీప్ తదితరులు ఉన్నారు.

ఎంపీగా సీతారాంనాయక్‌ను గెలిపించండి

చిన్నగూడూరు, ఏప్రిల్ 12 : మహబూబాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్‌ను గెలిపించాలని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్‌నాయక్ కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో నవీన్ స్వగృహంలో పార్టీ మండల అధ్యక్షుడు గుగులోత్ లక్ష్మణ్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శనివారం జిల్లా కేంద్రంలో జరిగే బూత్ స్థాయి విజయ సమ్మేళన సభను విజయవంతం చేయాలన్నారు. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకన్న, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గంధసిరి మధు, జిల్లా కార్యవర్గ సభ్యులు నవీన్, మండల ప్రధాన కార్యదర్శి ఘనగాని వేణు, శ్రీనివాస్, అశోక్, బాలు పాల్గొన్నారు

'సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి'

పెద్దవంగర, ఏప్రిల్ 12 : సమాజ సేవలో యువత భాగస్వామ్యం కావాలని వేముల వెంకన్న అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో వేముల వెంకన్న సాంబలక్ష్మి దంపతుల సహకారంతో జన వికాస ఆధ్వర్యంలో గ్రామ పంచాయితీ ఆవరణలో చలివేంద్రంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో దృష్ట్యా ఇతర ప్రాంతాలకు వెళ్ళే బాటసారుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సామాజిక సేవలో జన వికాస సేవలు అభినందనీయమన్నారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు దుంపల కుమార స్వామి, భిక్షం, ప్రభాకర్, వెంకటేశం, అశోక్, రమేష్, సోమయ్య, మేనక, జన వికాస ప్రతినిధులు శైలజ, సరిత పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చుతున్న చలివేంద్రాలు

చిన్నగూడూరు, ఏప్రిల్ 12 : బాటసారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు నిర్వహించడం అభినందనీయమని ఎస్సై ఝాన్సీ అన్నారు. మండల కేంద్రం బస్టాండ్ సెంటర్‌లో చిన్నగూడూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీవో యాకయ్య ఎపీఎం పాపయ్య, లక్ష్మి, జీపీ సిబ్బంది ఉన్నారు.

సెలైన్ బాటిల్‌లో నాచు



సెలైన్ బాటిల్‌లో ఉన్న నాచు

దంతాలపల్లి, ఏప్రిల్12 : ఓ గర్భిణి వైద్యం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లితే వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతో ఇంటికి సెలైన్ బాటిల్ ఇచ్చారు. ఇచ్చిన ఆర్ఎల్ సెలైన్ బాటిల్‌లో నాచు ఉండడంతో ఆమె కంగుతిన్నది. బాటిల్‌లో నాచు అనే వార్తా దావణంలా వాట్సాప్‌లో వైరలైంది. ఈ సంఘటన దంతాలపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటు చేసుకుంది. దాట్ల గ్రామానికి చెందిన గర్భిణి నరుకుటి సునీత ఈనెల 5న పీహెచ్‌సీకి పరీక్షించుకునేందుకు వెళ్లింది. ఆసమయంలో వైద్యురాలు అందుబాటులో లేక పోవడంతో స్థానికంగా ఉన్న ఓస్టాఫ్ నర్సు గర్భిణి వచ్చినట్లు ఫోన్లో సమాచా రం ఇచ్చారని, దీంతో సదరు వైద్యురాలు ఆర్ఎల్, ఎన్ఎస్ బాటిల్‌ను ఇచ్చి పంపించారు. దీంతో సునీత దంపతులు దాట్లకు వచ్చారు. ఈ నెల 12న ప్రభుత్వ దవాఖానలో ఇచ్చిన సెలైన్ బాటిల్ పెట్టుకునేందుకు ఆర్ఎంపీ దగ్గరకు వెళ్లారు. ఆర్ఎల్ సెలైన్ బాటిల్‌లో నాచు ఉన్న ట్లు గర్భిణి భర్త మనోజ్ గమనించాడు. వెంటనే పీహెచ్‌సీ వైద్య సిబ్బంది నిర్వాకం పట్ల జిల్లా ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్ఎల్ సెలైన్ బాటిల్‌లో నాచు ఉందనే విషయమై వైద్యురాలు చైతన్యను వివరణ కోరగా, స్టాఫ్ నర్సును సెలైన్ బాటిల్ పీహెచ్‌సీలోనే పెట్టేందుకు సూచించానన్నారు. గర్భిణి ఇంటి వద్దనే సెలైన్ బాటిల్ పెట్టుకుంటామనడంతో స్టాఫ్‌నర్సు ఇచ్చినట్లు తెలిసిందన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

చిన్నగూడూరు, ఏప్రిల్ 12 : మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత గెలుపుకై ప్రతీకార్యకర్త కృషి చేయాలని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం గుండంరాజుపల్లి గ్రామ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకుండా ఉన్నవారే నిజమైన కార్యకర్తలని, వారికి ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని అన్నారు, ఎంపీగా కవితను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. అనంతరం ఇటీవల మృతి చెందిన లింగయ్య, అనారోగ్యంతో బాధపడుతున్న వీరయ్య కుటుంబసభ్యలను పరామర్శించారు. ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంసింగ్ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, ఎంపీటీసీ మమత శ్రీను తదితరులు ఉన్నారు.

హోమియోపతి దినోత్సవం సందర్భంగా


పురస్కారం అందుకున్న లోహిత్



పురస్కారంతో రీసెర్చ్ మెడికో లోహిత్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12 : న్యూఢిల్లీ యశోభూమి ద్వారకలో ప్రపంచ హోమియోపతి దినోత్సవాన్ని పురస్కరించుకునిగురువారం రాత్రి రీసెర్చ్ మెడికో జంగం లోహిత్ సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ హోమియోపతి డైరెక్టర్‌డాక్టర్ సుభాష్‌కౌశిక్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం తట్టుపల్లి గ్రామానికి చెందిన జంగం రవి-సామ్రాజ్యం దంపతుల కుమారుడు జంగం లోహిత్ రాష్ట్రంలోని సంగారెడ్డి ఎంఎన్ఆర్ హోమియోపతిక్ మెడికల్ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. లోహిత్ షార్ట్‌టర్మ్ స్టూడెంట్ షిప్ ఇన్ హోమియోపతి విభాగంలో గైడ్ డాక్టర్ శ్రీవిద్య నేతృత్వంలో ఆరునెలలుగా ఆగ్రో హోమియోపతిపై రిసెర్చ్ చేశాడు. లోహిత్ పూర్తి చేసిన 'ఎన్ ఎక్స్‌పైరీ మెంటల్ స్టడీ టూ ఎవల్యూట్ ధ ఎఫీకేసీ ఆఫ్ ఆల్‌ట్రిస్ ఫరినోసా ఆఫ్ డిఫరెంట్ పొటెన్సిస్ ఆన్ ఐరన్ డిఫెన్సీ క్లోరిసిస్ ఆఫ్ గ్లిసిన్ మాక్స్ (సోయాబీన్)' అనే అంశానికి పురస్కారం వచ్చింది. లోహిత్‌కు పురస్కారం దక్కడం పట్ల కళాశాల యాజమాన్యం, తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'ఐఐటీ' రామయ్యను కలిసి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



చుక్క రామయ్యను మర్యాద పూర్వకంగా కలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి(జనగామ జిల్లా), ఏప్రిల్ 12 : ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ ఐఐటీ రామయ్యను హైదరాబాద్‌లోనిఆయన స్వగృహంలో శుక్రవారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రామయ్య ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలారోజుల నుంచి రామయ్యను చూసేందుకు రావాలని అనుకున్నానని, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత బాధ్యతలు పెరిగాయని అందుకు రాలేకపోయానన్నారు. మాజీ పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, గూడూరు మాచెర్ల పుల్లయ్య ఉన్నారు.

వరంగల్ తరలిన బీజేపీ శ్రేణులు

పాలకుర్తి : ఎంపీ ఎన్నికలను పార్టీ శ్రేణులను సిద్ధం చేసేందుకు వరంగల్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ బూత్ కమిటీల సమ్మేళనానికి మండలం నుంచి ఆపార్టీ శ్రేణులు వాహనాల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్ మాట్లాడారు. మండల అధ్యక్షుడు దుంపల సంపత్, కమ్మగాని శ్రీకాంత్ పాల్గొన్నారు.